ఏఐతో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం పెంపు

- జిల్లాలో 33 పాఠశాలల్లో ఏఐలో బోధన
- రూ. 27 కోట్లతో పాఠశాలల మరమ్మతులు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- జ్యోతిబాపూలే కళాశాలలో కలెక్టర్ తనిఖీ

ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

విద్యార్థిని పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌టెరు ,మార్చి 15: విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచేందుకు కృత్రిమ మేధా సాయంతో రూపొందించిన శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగిస్తున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో జడ్పీ హెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్-ఏఎక్స్‌ఎల్ (ఏఐ)ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై అందుతున్న కృత్రిమ మేధా ఆధారిత శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించి వారి సామర్థ్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏఐను ఉపయోగించి విద్యార్థి నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచేలా ఈ శిక్షణ ల్యాబ్‌లు పని చేస్తాయన్నారు. జిల్లాలోని 33 పాఠశాలల్లో శిక్షణను ప్రవేశపెట్టామన్నారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాల్లో ఉన్న లోపాలను వ్యక్తిగతంగా వారే గ్రహించేలా చేస్తూ వాటిని సరిచేసేలా ఏఐ ప్రోగ్రాం ఉందన్నారు. స్కూళ్ల మరమ్మతులకు రూ.27కోట్లు ఖర్చు చేశామన్నారు. విద్యార్థులు చక్కగా చదివి ప్రయోజకులు కావాలని కోరారు. తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చురుకుగా ఉండాలని, పిల్లలు ఎలా చదువుతున్నారో, టీచర్లు పాఠశాలు ఎలా చెబుతున్నారో తరచూ పరిశీలించాలని సూచించారు. అందరం కలిస్తేనే నాణ్యమైన బోధన అమలవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్‌తోపాటు కంప్యూటర్‌లపై హెడ్‌సెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఏఎంవో అనురాధ, ఎంఈవో నాగేశ్వర్‌నాయక్, తహసీల్దార్, శారద, ఏఈపీసీ చైర్మన్ అండాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తంగి మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలో వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల తనిఖీ

ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల, పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యం, వారికి అందజేస్తున్న ఆహారంపై సిబ్బందిని ప్రశ్నించారు. పరిశుభ్రత, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్‌ను, విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్‌తో మాట్లాడి వసతులు, బోధన గురించి ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. మంచి ఉత్తీర్ణత రావాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలన

రామేశ్వరంబండలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోవని కొందరు లబ్ధిదారులు కలెక్టర్‌తో అన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ డిపార్టుమెంట్ నుంచి కట్టిస్తే మీరు అంగీకరిస్తారా.? అని అడిగారు. నిబంధనల మేరకు ఇండ్లను త్వరగ నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో యాదగిరిని అడిగారు. 72 ఇండ్లు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు.

ఏప్రిల్ 20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ఏప్రిల్, మేలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి ప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు శనివారం ప్రకటనలో వెల్లడించారు. ఏప్రిల్ 20 నుంచి 26 వరకు థియరీ పరీక్షలు, 26 నుంచి మే 3 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష రుసుము చెల్లించిన వారందరూ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామిని 8008403635 నెంబరుపై సంప్రదించాలన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో పాండు

సమాచారమివ్వాలి

చౌటకూర్, మార్చి 15:ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం అందించాలని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 78 మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో కేవలం 13మంది మాత్రమే డబ్బులు చెల్లించారని తెలిపారు. 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31వ తేదీలోగా డబ్బులు చెల్లించిన వారికి ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పాండు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఎంపీడీవో కె.శంకర్, ఎంపీవో శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు సందీప్‌గౌడ్, పావని తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో విధ్వంసం

జహీరాబాద్, మార్చి 15: మొగుడంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు విధ్వంసం సృష్టించారు. పాఠశాల హెచ్‌ఎం, గ్రామస్తుల కథనం ప్రకారం..పాఠశాలలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఫ్యాన్లు, కిటికీలు, ట్యూబ్‌లైట్లు ధ్వంసం చేశారు. ఉదయం పాఠశాలలో జరిగిన విధ్వంసాన్ని చూసిన ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

మునిపల్లి, మార్చి 15: ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తక్కడపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం..మండలంలోని చిన్నచెల్మడ గ్రామానికి చెందిన అమీరుద్దీన్(30) తక్కడపల్లికి చెందిన సద్దాం హమ్మద్‌తో కలిసి గ్రామ శివారులోని సింగూరు బ్యాక్ వాటర్‌లో కరెంట్ సహాయంతో చేపలు పట్టేందుకు వెళ్లారు. కరెంట్ పెట్టే సమయంలో అమీరుద్దీన్‌కు షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి అన్న బషీరుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ట్రాక్టర్ల పట్టివేత

జహీరాబాద్, మార్చి 15: అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు శనివారం హద్నూర్ ఎస్ఐ చల్ల రాజశేఖర్ తెలిపారు. మండలంలోని గణేశ్‌పూర్ శివారులోని గనుల నుంచి ఎర్రరాయిని తీసుకెళ్తున్న ట్రాక్టర్లను గంగ్వార్ గ్రామ సమీపంలో పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఎర్రరాయిని వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలను ప్రారంభిస్తున్న సలోమాన్‌రెడ్డి

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సలోమాన్‌రెడ్డి జ్యోతి వెలిగించి ఫేర్‌వెల్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగాలని, నైతిక విలువలతో జీవించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కానుకుంట ఎమ్మార్పీఎస్ నాయకులు

గుమ్మడిదల, మార్చి15: 39 రోజులుగా డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ) రద్దుపై ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా సర్కారు స్పందించడంలేదని రైతు జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుపై ధ్వజమెత్తారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేయిస్తున్న డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే రద్దు చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శనివారానికి 39వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదలలో కానుకుంట గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నల్లవల్లిలో రైతు మహిళా సంఘాల సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కొత్తపల్లిలో గ్రామ యువకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ప్యారానగర్ డంపింగ్ యార్డు (ఎంఎస్‌బ్ల్యూ)కు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండలవ్యాప్తంగా 13 గ్రామాల ప్రజలు, అఖిలపక్ష పార్టీల నాయకులు, అన్ని కుల సంఘాలు, యువజన సంఘాలు డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, మంద భాస్కర్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నక్క వెంకటేశం గౌడ్, కాలకంటి రవీందర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, మంద బలరాంరెడ్డి, ఆంజనేయులు యాదవ్, కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రాజు గౌడ్, రైతు మహిళా సంఘం సభ్యులు, ఎమ్మార్పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు

జహీరాబాద్, మార్చి 15: జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాయి. 2038 నాటికి మున్సిపాలిటీలో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఆయా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో పైప్‌లైన్ తవ్వకాల పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని సరఫరా చేస్తున్నారు. భవిష్యత్‌లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలంలోని ఇటికేపల్లి శివారులో సింగూర్ బ్యాక్ వాటర్ నుంచి జహీరాబాద్ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాయికోడ్, న్యాల్‌కల్, ఝరాసంగం, జహీరాబాద్ మండలాల్లోని గ్రామాల మీదుగా 40 కిలోమీటర్ల దూరం నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ పైప్‌లైన్‌ను జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో పైపులు డంపింగ్ చేశారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పస్తాపూర్ గ్రామ శివారులో 1.14లక్షల లీటర్ల కెపాసిటీతో భారీ వాటర్ ట్యాంకును నిర్మించనున్నట్లు మున్సిపాల్ అధికారులు పేర్కొన్నారు. వాటర్ ట్యాంకు పరిధిలోని 7 కిలోమీటర్ల దూరంలోని ప్రజలకు తాగునీటి కోసం అవసరమైన ట్యాంకులు, నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే చేపట్టాల్సిన పనుల కోసం స్థలాలను గుర్తించామని, 2038 వరకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానున్నాయన్నారు. ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని అమృత్ 2.0 పథకం కింద శాశ్వత తాగునీటి ఇబ్బందులు దూరం కానున్నాయని పేర్కొన్నారు.

న్యాల్‌కల్ మండలంలోని ముంగి శివారులో పైప్‌లైన్ కోసం తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

పటాన్‌చెరు, మార్చి 15: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడి కుమారుడి వివాహానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ హాల్లో సంతోష్‌రెడ్డి-సంగీతల వివాహం జరిగింది. వివాహానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, శేరి శుభాష్‌రెడ్డి, క్రాంతికిరణ్, దానం నాగేందర్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మహిళల అక్రమ రవాణాను అరికట్టాలి

ఝరాసంగం, మార్చి 15: మహిళలు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టడంలో గ్రామ సంఘాల బాధ్యత ఎంతో ఉందని పేదరిక నిర్మూలన సంస్థ సహాయక ప్రాజెక్ట్ మేనేజర్ టిక్యా నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో వీవోఏలు, వీవోబీలకు మహిళల అక్రమ రవాణాపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలియని నంబర్ల నుంచి కాల్స్ వచ్చినా, బెనిఫిట్ మెసేజ్‌లు వచ్చినా స్పందించవద్దన్నారు..మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దానిని అరికట్టాల్సి బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఐ సంగమేశ్వర్, టీవోటీ మారుతి, సీసీలు మల్లేశం, గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, నర్సమ్మ, మహిళా సంఘాల సభ్యులు, వీవోఏలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి...చెల్లెలికి గాయాలు

జహీరాబాద్, మార్చి 15: పరీక్ష రాసేందుకు బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంలో అన్న మృతి చెందగా, చెల్లెలుకు తీవ్రగాయాలైన ఘటన జహీరాబాద్ మండలంలోని హుగ్గేలి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. జహీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం..కర్ణాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్‌కు చెందిన ప్రదీప్(21), అతడి చెల్లెలు ఆశా(18)హైదరాబాద్‌లో ఉంటున్నారు. బసవకల్యాణ్‌లో చెల్లెలు పరీక్ష రాసేందుకు హైదరాబాద్ నుంచి బైక్‌పై బయలు దేరారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గేలి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై లారీని డ్రైవర్ అతివేగంగా నడుపుతూ మరో వాహనాన్ని ఓవర్‌టెక్ చేయబోయి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రదీప్ అక్కడిక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన ఆశాను మెరుగైన వైద్యం కోసం బీదర్ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

రామచంద్రాపురం,మార్చి15: భారతీనగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కోరారు. శనివారం జోనల్ కార్యాలయంలో జెడ్సీని ఆమె ప్రత్యేకంగా కలిసి డివిజన్‌లో ఉన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. బొంబాయికాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ప్రహరీ నిర్మాణం, రైతుబజార్‌లో గ్రీల్స్ ఏర్పాటు, మ్యాక్ సొసైటీలో ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. హెచ్ఐజీ, ఎల్ఐజీలో సీసీ రోడ్లు, వాటర్ డ్రైన్ పనుల కోసం ప్రతిపాదనలు ఇవ్వడంతోపాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన జెడ్సీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం జోనల్ కమిషనర్‌కు రూ.2 కోట్ల ప్రతిపాదనలు అందించామని, డివిజన్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరినట్లు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి సూరికృష్ణ

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

ఝరాసంగం, మార్చి 15: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థి వాటిని గౌరవించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ సూచించారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయంలో మండల లీగల్ సర్వీసెస్ జహీరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి, న్యాయవాదులు మాట్లాడుతూ...విద్యార్థులు నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి చట్టాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సంబంధించిన పారాలీగల్ వలంటీర్లకు తెలియజేయాలన్నారు. బాలబాలికలపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే కఠినమైన శిక్ష తప్పదని, వేధింపుల విషయంలో కఠినమైన శిక్షలుంటాయన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తన కలిగి విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మాణిక్‌పాటిల్, సీనియర్ న్యాయవాది పాండురంగారెడ్డి, న్యాయవాదులు రుద్రయ్య స్వామి, సయ్యద్ షకీల్, పారాలీగల్ వలంటీర్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ పేర్కొన్నారు. వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జగదీశ్వర్ మాట్లాడుతూ వినియోగదారులు చైతన్యంగా ఉన్నప్పుడే ఉత్పత్తిదారులు, అమ్మకందారుల మోసాలకు గురికాకుండా ఉంటారని పేర్కొన్నారు. మనం కొనే ప్రతి వస్తువు నాణ్యమైనదా లేదా అని తెలుసుకునే బాధ్యత మనపై ఉంటుందన్నారు. అదేవిధంగా కొనే ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. కొన్ని వస్తువు నాణ్యమైనది కానప్పుడు సదరు బిల్లుతో వినియోగదారుల సహాయ కేంద్రాల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో 29 సంవత్సరాల వయస్సులోపు వారు ఎవరైనా పాల్గొనవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. కళాశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇరువర్గాల పరస్పర దాడులు..కేసు నమోదు

అందోల్, మార్చి 15: పాతకక్షల నేపథ్యంలో ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో రెండు వర్గాలకు చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు శనివారం తెలిపారు. జోగిపేటలోని కుర్మవాడకు చెందిన కడాల దాను, కడాల శ్రీశైలం, కడాల తేజ, కడాల యాదమ్మ మరో వర్గానికి చెందిన కడాల రమేశ్, కడాల పుష్పలత, కడాల బాలమణి, కడాల బాలయ్య పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని శనివారం దాడులు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఫిర్యాదు చేయడంతో 8మందిపై కేసు నమోదు చేశామన్నారు. కేసు విషయంపై స్టేషన్‌కు పిలిచి మాట్లాడుతున్న క్రమంలో కడాల దాసు అనే వ్యక్తి నన్నే..స్టేషన్‌కు పిలుస్తారా..? అంటూ సిబ్బందిని తిడుతూ చేతిలో ఉన్న బీరు బాటిల్‌ను స్టేషన్‌లోకి విసిరేశాడు. అంతటితో ఆగకుండా ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి హల్‌చల్ చేశాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించారని అతడిపై మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నారాయణఖేడ్‌లో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

నారాయణఖేడ్, మార్చి 15: అసెంబ్లీ సమావేశాల నుంచి మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ నాయకులు మహారెడ్డి వెంకట్‌రెడ్డి చౌరస్తా వద్ద సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ రాజకీయం చేస్తూ ఉద్దేశపూర్వకంగా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం శాసనసభ చరిత్రలోనే చీకటి రోజు అన్నారు. వెంటనే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నగేశ్, రవీందర్‌నాయక్, విఠల్‌రావు, విఠల్, నర్సింహులు, పార్శెట్టి సంగప్ప, వెంకటేశం, సిద్ధు, సురేశ్, ప్రసాద్, మల్‌గొండ, పోచయ్య, చింటూ నరేశ్, శ్రీనివాస్, శ్రీను, సాయిలు, గణపతి ఉన్నారు.

సంగారెడ్డిలో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి, మార్చి 15: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే కక్షపూరితంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్రభుత్వ దిష్టబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు జోక్యం చేసుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తే సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని బీఆర్‌ఎస్‌పై కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ కార్యదర్శి నర్సింలు, యువత నాయకులు శ్రావణ్‌రెడ్డి, పాండురంగం, అజీమ్, విఠల్, ఆంజనేయులు, సమీ, శేఖర పరుశ రామ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యార్థులకు ఎంతో మేలు

హద్నూర్ ప్రాథమిక పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన విద్యాధికారి మారుతీరాథోడ్

జహీరాబాద్, మార్చి 15: ఆర్టిఫిషియన్ ఇంటలిజెన్స్ అభ్యసన విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల విద్యాధికారులు బస్వరాజ్, మారుతీరాథోడ్, జాఫర్‌అలీ పేర్కొన్నారు. శనివారం ఆయా మండలాల్లోని హద్నూర్, కొత్తూర్(బి), సత్వార్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ఏ ఎక్స్ఎల్ ల్యాబ్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియన్ ఇంటలిజెన్స్ అభ్యసన విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ వారికి తగిన అభ్యస కృత్యాలను జనరేట్ చేస్తుందన్నారు. దీంతో విద్యార్థుల్లోఅభ్యసనపై మరింత ఉత్సుకతను కలిగించేలా బోధన జరపవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

కొత్తపల్లిలో పంట పొలాల వద్ద విద్యుత్ సమస్యలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ రవీందర్

గుమ్మడిదల,మార్చి15: విద్యుత్ వినియోగదారులకు, పంటలు సాగు చేసుకున్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఏడీఈ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ రవీందర్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని ఏడీఈ రైతులకు సూచించారు. సిబ్బంది స్పందించకుంటే ఏడీఈకి కాల్‌చేస్తే తానే స్పందించి విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. వినియోగదారులతో లైన్‌మెన్లు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు ఆంజనేయులు, శ్రీనివాస్, సాయిరెడ్డి, పాపయ్య, అంజిరెడ్డి, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

మొగుడంపల్లిలో యూనియన్ బ్యాంకు ఏటీఎంను ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ వికాస్

యూనియన్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మార్చి 15: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట రీజినల్ ప్రధాన మేనేజర్ ఎడ వికాస్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు, రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు బ్యాంకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ముఖేశ్, చీఫ్ మేనేజర్ సంజయ్‌చౌదరి, డిప్యూటీ మేనేజర్ ప్రవాస్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.